సాక్షి
పెద్దపల్లి
దీపావళి శుభాకాంక్షలు
సోమవారం । 20 । అక్టోబర్ । 2025

న్యూస్‌రీల్

ఓదెల మల్లన్నకు పట్నాలు



పట్నాలు వేస్తున్న భక్తులు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి కూడా పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కోనేరులో స్నానం ఆచరించారు. మల్లికార్జున స్వామి, సీతారామచంద్రస్వామి, నందీశ్వరులను దర్శించుకున్నారు. అర్చకులు వీరభద్రయ్య, నరసింహాచారి ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు. ఒగ్గు పూజారులతో స్వామివారికి పట్నాలు వేయించారు. బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఆలయ ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ కుమారస్వామి భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆదివరాహస్వామికి పూజలు



స్వామివారి సన్నిధిలో భక్తులు

కమాన్‌పూర్(మంథని): ప్రసిద్ధ శ్రీఆదివరాహ స్వామి దర్శనం కోసం ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనం అనంతరం ముడుపులు చెల్లించుకున్నారు. అనంతరం పలువురు భక్తులు అన్నదానం చేశారు.

రైళ్లన్నీ కిటకిట



రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

రామగుండం: దీపావళి పండుగ పురస్కరించుకొని సుదూర ప్రాంతాల నుంచి స్వస్థలాలకు చేరుకుంటున్న ప్రయాణికులతో రైళ్లు, రైల్వేస్టేషన్లు ఆదివారం కిటకిటలాడాయి. భాగ్యనగర్, సింగరేణి, ఇంటర్‌సిటీ, కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్, కేరళ తదితర రైళ్లలో రద్దీ బాగా పెరిగిపోయింది. శనివారం కూడా సెలవురోజు అయినా.. బీసీ బంద్ నేపథ్యంలో ప్రయాణికులు తమ ప్రయాణాన్ని ఆదివారానికి వాయిదా వేసుకున్నారు. దీంతో రైళ్లన్నీ ఆదివారం రద్దీగా మారాయి.

ఆస్పత్రిలో పార్కింగ్ పాట్లు



అస్తవ్యస్తమైన పార్కింగ్

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వ, మాతాశిశు ఆస్పత్రుల్లో వాహనాల పార్కింగ్ ఇష్టారాజ్యంగా ఉంటోంది. ప్రధానంగా ద్విచక్రవాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలుపుతున్నారు. గర్భిణులకు తీసుకొచ్చే 102, అత్యవసర వైద్యం కోసం బాధితులను తీసుకొచ్చే 108 వాహనాలు ఆస్పత్రి ఆవరణలోకి వచ్చివెళ్లేందుకు ద్విచక్రవాహనాలు అడ్డుగా ఉంటున్నాయి. పేషెంట్లు, బంధువుల రాకపోకలకూ సమస్యలు తలెత్తుతున్నాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అభివృద్ధే లక్ష్యం

గోదావరిఖని: అభివృద్ధిని అడ్డుకునేందుకు ఎవరెన్ని కుట్రలు చేసినా ఊరుకునేది లేదని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ హెచ్చరించారు. స్థానిక బస్టాండ్ సమీపంలో చిరువ్యాపారులు నిర్మించుకున్న షాపింగ్ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు.

అంతర్గాంను అభివృద్ధి చేస్తాం

అభివృద్ధిలో అంతర్గాం మండలాన్ని అగ్రగామిగా నిలుపుతామని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. మండల ముఖ్య నాయకులతో వివిధ అంశాలపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు ధారవేణి సంతోష్, తమ్మనవేని మణికుమార్, అజయ్, ప్రవీణ్ కాంగ్రెస్‌లో చేరారు. నాయకులు భాను తిరుపతినాయక్, హనుమాన్‌రెడ్డి, కాంపెల్లి సంతోష్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సంక్షోభంపై దృష్టి సారించండి

పెద్దపల్లి: బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలోని దాదాపు 25,000 మంది విద్యార్థులు ఫీజు బకాయిల చెల్లింపులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సంక్షోభంపై దృష్టి సారించాలని ఎంపీ వంశీకృష్ణ కోరారు. తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు ఒక లేఖలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి రూ.200 కోట్లు ప్రైవేట్ పాఠశాలలకు చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు.ల

వెలుగుల దీప్తి.. ఆలోచనల స్ఫూర్తి



పెద్దపల్లిరూరల్ : జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తాలో పూల క్రయవిక్రయాలు



గోదావరిఖనిటౌన్ : రామగుండం నగరంలో..



పెద్దపల్లి : ఆకట్టుకుంటున్న టెర్రాకోట ప్రమిదలు

పెద్దపల్లి/గోదావరిఖని: కోటి వెలుగుల క్రాంతి. కొత్త ఆలోచనలకు స్ఫూర్తి దీపావళి. కష్టాలు అనే చీకట్లను తొలగించే వేడుక. చెడుపై మంచి సాధించిన విజయంతో సంబురాలు జరుపుకునే వెలుగుల తారాజువ్వల మాలిక. నేటి దీపావళి వేడుకలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సిద్ధం అయ్యారు. వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో ప్రత్యేక పూజలు, నివాసాలు, ఆలయాల్లో నోములు, వ్రతాలు జరుపుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దీపావళి సందర్భంగా మార్కెట్లు కిక్కిరిశాయి. బంతిపూలు, గుమ్మడికాయలు, ఇతర పూజాసామగ్రి అమ్మకాలతో రద్దీగా మారాయి. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టపాకాయల దుకాణాల వద్ద సందడి నెలకొంది. కిలో చొప్పున విక్రయిస్తుండగా.. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని చెబుతున్నారు. ఏదేమైనా నిశీధిలో అలుముకున్న అమావాస్య చీకట్లను బాణసంచాలతో బెదరగొట్టి, వెలుగుల దీపావళి వేడుకను సంబురంగా జరుపుకునేందుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు సిద్ధం అయ్యారు.

– వివరాలు 8లో

పనులు ప్రారంభించలే

- రూ.2కోట్లున్నా.. ప్రారంభానికి నోచుకోని భవన నిర్మాణం
- ల్యాబ్ గదుల్లోనే బాలికల జూనియర్ కాలేజీ నిర్వహణ
- సొంతభవనం లేక విద్యార్థినులు, అధ్యాపకుల ఇబ్బందులు
- మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు.. తప్పని అవస్థలు



బాలికల జూనియర్ కాలేజీలో ల్యాబ్

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీకి సొంతభవనం లేదు. బాలుర, బాలికల జూనియర్ కాలేజీ ల్యాబ్‌లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. ఐదు కోర్సులు అందుబాటు ఉండగా 230 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. 14మంది అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. బాలికల కాలేజీ ప్రిన్సిపాల్ ఈఏడాది జనవరిలో ఉద్యోగ విరమణ చేశారు. బాలుర కాలేజీ ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డికి అదనపు బాధ్యతలను అప్పగించారు.

సీఎం శంకుస్థాపన చేసి ఏడాది..

బాలికల జూనియర్ కాలేజీ భవన నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దాదాపు ఏడాది క్రితం శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ పనులు మొదలే కాలేదు. పాత భవనం కూల్చి కొత్తభవనం పనులు ప్రారంభించే సమయంలో స్థానికుల నుంచి అభ్యంతరాలు వచ్చాయి. వాకర్స్‌కు అనువుగా ఉండేలా చూడాలని విన్నవించారు. దీంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో విద్యార్థినుల తరగతులను బాలికల జూనియర్ కాలేజీకి చెందిన మూడు, బాలుర కాలేజీకి చెందిన మరో 3 ల్యాబ్ గదుల్లో ప్రస్తుతం తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 కోట్లతో పనులు చేపడితే ఇప్పటికే భవనం పూర్తయ్యేదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

మల, మూత్ర విసర్జనకు తిప్పలే..

ల్యాబ్ గదుల్లో తరగతులు నిర్వహిస్తుండగా విద్యార్థినులు, అధ్యాపకులకు అవసరమైన మరుగుదొడ్లు అందుబాటులో లేక అవస్థలు పడుతున్నారు. పాత మరుగుదొడ్లకు మరమ్మతులు చేసుకుని వాటినే విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు వినియోగించుకుంటున్నారు. పురుష అధ్యాపకులతోపాటు నాన్ టీచింగ్ స్టాఫ్ ఒకటి, రెంటికి బయటకు వెళ్లాల్సిన పరిస్థితులే నెలకొని ఉన్నాయి.

రూ.20లక్షలతో తాత్కాలిక మరమ్మతులు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని లాబోరేటరీ గదులు వర్షాలకు ఉరుస్తుండడం, ఫ్లోరింగ్ కుంగిపోవడంతో తాత్కాలిక మరమ్మతులను రూ.20లక్షల అంచనాలతో చేపట్టారు. ఇదివరకున్న ఫ్లోరింగ్ తొలగించి సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేపట్టినా నాసిరకంగా సాగుతున్నాయనే ఫిర్యాదులు ఉన్నాయి. అధికారులు పర్యవేక్షించి పనులు నాణ్యవంతంగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.

సొంత భవనం నిర్మించాలి



ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీకి సొంత భవనం నిర్మించాలి. ప్రస్తుతం ల్యాబ్ సామగ్రిని ఓ మూలన పెట్టి ఆ గదిలో చదువుకోవాల్సి వస్తోంది. తరగతి గదిలో ఉండాల్సిన వాతావరణం లేదు. మాకు ఇబ్బందిగా ఉంది.

– జాహ్నవి, హెచ్ఈసీ, సెకండియర్

అధికారులు చొరవ చూపాలి



బాలికల జూనియర్ కాలేజీ భవనం పనులను త్వరగా చేపట్టేందుకు వీలుగా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలె. బాలికలకు అవసరమైన సౌకర్యాలతో కొత్తభవనం నిర్మించి అందుబాటులోకి తేవాలి.

– శ్రావణి, సీఈసీ, సెకండియర్

త్వరలోనే పనులు



బాలికల జూనియర్ కాలేజీ సొంత భవనం పనులు త్వరలోనే ప్రారంభం అవుతాయి. ఇసుక లభ్యం కాగానే జరుగుతాయి. పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, ముత్తారంలో ప్రిన్సిపాల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

– కల్పన, ఇంటర్ విద్య నోడల్ అధికారి



క్రాకర్స్ కాల్చుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, వేదికపై మరో మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

వైభవం.. దీపావళి ఉత్సవం

- ఆకట్టుకున్న సినీ, మిమిక్రీ ఆర్టిస్టుల ప్రదర్శనలు
- హాజరైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి ఆధ్వర్యంలో రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ నేతృత్వంలో స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో ఆదివారం రాత్రి నిర్వహించిన దసరా, దీపావళి హంగామా కార్మిక కుటుంబాలను విశేషంగా ఆకట్టుంది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సింగరేణి ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమా ర్, ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు రాంచందర్ తదితరులు హాజరయ్యారు. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి మిమిక్రీకి విశేష స్పందన లభించింది. గీతామాధురి గీతాలు, సినీ యాక్టర్లు ఆలీ, శివారెడ్డి చేసిన నృత్యం ఆకట్టుకుంది.



కళాకారులు ఆలీ, శివారెడ్డి నృత్యం



కళాకారుల ప్రదర్శన



వేడుకలకు హాజరైన ఎస్సీ కమిషన్ జాతీయ సభ్యుడు రాంచందర్, ప్రముఖులు, ప్రజలు

అభివృద్ధి పనులకు నిధులు

- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



మంత్రి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ ఎంపీపీ దేవక్క, నాయకులు

రామగిరి(మంథని): అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అభయం ఇచ్చారు. వివిధ ప్రాంతాల్లో మంత్రి ఆదివారం పర్యటించారు. ఇటీవల మృతి చెందిన బుధవారంపేట(రామయ్యపల్లి) గ్రామానికి చెందిన సోమిశెట్టి మల్లయ్య కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. మల్లయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క మంత్రిని కలిసి పలు సమస్యలు విన్నవించారు. ప్రధానంగా బుధవారంపేట గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీహాల్ మరమ్మతు, విస్తరణకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మంత్రి సానుకులంగా స్పందించారు. కాగా, రామయ్యపల్లి స్టేజీ వద్ద మంథని పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ మంత్రి లక్ష్మణ్‌ను కలిశారు. ఏఎంసీ చైర్మన్ కుడుదుల వెంకన్నతో కలిసి మంత్రికి శాలువా కప్పి సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్, నాయకులు రోడ్డ బాపన్న, బుద్దార్థి బుచ్చయ్య, దేవునూరి రజిత, ఆరెల్లి కొమురయ్య, దేవునూరి శ్రీనివాస్, తీగల సమ్మయ్య, నరేశ్, బావు కత్తెరసాల, కన్నూరి శ్రావణ్, పూదరి రమేశ్, మల్లయ్య, రాజయ్య, మహేందర్, ముస్కుల సురేందర్‌రెడ్డి, రావికంటి సతీశ్ కుమార్, అజీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం



వాకర్స్‌ను సన్మానిస్తున్న ఉపేందర్

జ్యోతినగర్(రామగుండం): నడకతో ఆరోగ్యంగా ఉంటామని హెచ్ఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీహెచ్ ఉపేందర్ అన్నారు. ఎన్టీపీసీ సింధూర కళాశాలలో ఆదివారం వాకర్స్‌కు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏ వయసు వారైనా రోజూ కనీసం 30 నిమిషాలపాటు వ్యాయామం చేయాలని సూచించారు. కళాశాల మైదానంలోని వాతావరణంలో ఇందుకు అనుకూలంగా ఉందని తెలిపారు. పదేళ్లుగా వాకింగ్ చేస్తున్న పాపయ్య టీం ప్రతినిధులను శాలువాలు కప్పి సన్మానించారు. ఎన్టీపీసీ రిటైర్డ్ ఉద్యోగులు కొమ్ము గోపాల్, రాజమౌళి, అశోక్, శంకరయ్య, పురుషోత్తం, సాయిలు, సత్యనారాయణ, విజన్ టెక్నాలజీ నిర్వాహకులు మహేశ్వర్‌రెడ్డి, కిషన్‌రావు, మహేశ్, కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్, నాయకులు అబ్దుల్లా, తిరుపతిరెడ్డి ఉన్నారు.

రాజన్నను దర్శించుకున్న శృంగేరి పీఠాధిపతి

- ఘనస్వాగతం పలికిన మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్
- పూర్ణకుంభ కలశంతో ఆలయ అర్చకుల స్వాగతం

వేములవాడ: ధర్మ విజయ యాత్రలో భాగంగా వేములవాడకు శృంగేరి పీఠాధిపతి జగద్గురు విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి ఆదివారం రాత్రి చేరుకున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్, కలెక్టర్ హరిత, ఎస్పీ మహేశ్ బీ గీతే, ఈవో రమాదేవి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ స్థానాచార్యులు ఉమేశ్‌శర్మ ఆధ్వర్యంలో అర్చకుల బృందం పూర్ణకుంభ కలశంతో స్వామి వారికి స్వాగతం పలికారు. స్థానిక తెలంగాణచౌక్‌కు చేరుకున్న స్వామీజీ ప్రత్యేక రథంపై ఆసీనులయ్యారు.



అనుభాషణం చేస్తున్న శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామీ

జేసీబీ సహాయంతో గజమాల వేశారు. ఒగ్గుడోలు, భజన మండలి కళాకారులు ప్రత్యేక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. స్వామీజీని చూసేందుకు పెద్ద ఎత్తున జనం తరలివచ్చారు.

పెద్దమ్మ స్టేజీ వద్ద జిల్లాలోకి..

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతీతీర్థ మహాస్వామి చేపట్టిన విజయ ధర్మ యాత్ర గంభీరావుపేట మండలం పెద్దమ్మస్టేజీ వద్ద జిల్లాలోకి ప్రవేశించింది. బాసర నుంచి వస్తున్న స్వామీ యాత్రకు పెద్దమ్మస్టేజీ, ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో భక్తులు ఘనంగా స్వాగతం పలికారు.



విధుశేఖర భారతీ మహాస్వామికి స్వాగతం పలుకుతున్న విప్, అధికారులు

మద్యం సిండికేట్‌కు చెక్?

- దరఖాస్తుల దాఖలుకు గడువు ఈనెల 23
- 27న డ్రా ద్వారా వైన్స్‌షాపుల కేటాయింపు

జిల్లా సమాచారం

ప్రాంతం	వైన్స్ షాపులు	అందిన టెండర్లు
పెద్దపల్లి	20	384
సుల్తానాబాద్	15	283
రామగుండం	24	450
మంథని	15	261



వైన్స్‌షాప్‌ల కోసం టెండర్లు వేస్తున్న వ్యాపారులు


పెద్దపల్లి: మద్యం దుకాణాలకు భారీస్థాయిలో టెండర్లు దాఖలు అవుతాయని భావించినా.. అధికారుల అంచనాలు తారుమారయ్యాయి. వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ సంఖ్యలో దరఖాస్తులు సమర్పించారనే కారణంతో టెండర్ల స్వీకరణకు ప్రభుత్వం గడువు పొడిగించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈక్రమంలో ఈనెల 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ మహిపాల్‌రెడ్డి ఆదివారం తెలిపారు. జిల్లాలో 74 మద్యం దుకాణాలు ఉండగా.. శనివారం అర్ధరాత్రి వరకు 1,378 దరఖాస్తులు వచ్చాయని ఆయన పేర్కొన్నారు. గడువు ముగిశాక ఈనెల 27న లక్కీడ్రా ద్వారా మద్యం దుకాణాలు కేటాయిస్తామని ఆయన పేర్కొన్నారు.

తక్కువ దరఖాస్తులపై సమీక్ష

జిల్లాలో 74 వైన్స్‌షాపులు ఉండగా.. గతంలో 2,020 దరఖాస్తులు అందాయి. ఈసారి 1,378 మాత్రమే టెండర్లు దాఖలు కావడం, వీటిమధ్య భారీవ్యత్యాసం ఉండడంతో వ్యాపారులు సిండికేట్‌గా మారినట్లు అభిప్రాయపడుతున్నారు. అయితే, సిండికెట్‌కు చెక్ పెట్టేందుకే దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం పొడిగించిందని అంటున్నారు. అయితే, పెద్దపల్లి సమీపంలోని బంతదంపల్లి స్వరూప గార్డెన్స్‌లో కలెక్టర్ కోయ శ్రీహర్ష సమక్షంలో ఈనెల 27న లక్కీడ్రా తీస్తారు. ఈప్రక్రియ ద్వారా వైన్స్‌షాపులు కేటాయిస్తారు. ఈప్రక్రియ మొత్తాన్ని వీడియోలో చిత్రీకరిస్తారు.

రాజకీయాలను శాసించాలి

- యాదవ సంఘాల ఉమ్మడి జిల్లా కన్వీనర్ సొగాని కొమురయ్య



మాట్లాడుతున్న సొగాని కొమురయ్య

పెద్దపల్లి/పెద్దపల్లిరూరల్: స్థానిక ఎన్నికల్లో యాదవులను అత్యధిక సంఖ్యలో గెలిపించుకుని రాజకీయాలను శాసించాలని యాదవ సంఘాల ఉమ్మడి జిల్లా కన్వీనర్ సొగాని కొమురయ్య అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం ఆధ్వర్యంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభాలో 22 శాతం యాదవులు ఉన్నారని, ఆ ప్రాతిపదికన రాజకీయ అవకాశాలు లభించడంలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయం సాధించే అంశాలపై ఈనెల 24న కరీంనగర్ జిల్లాలోని చెంజర్ల ఫామ్‌హౌస్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తామని, పోటీచేసేవారు హాజరుకావాలని ఆయన కోరారు. ప్రతీ ఆదివారం యాదవులు మద్యం, మాసం మానేయాలని ఆయన కోరారు. సమావేశంలో నాయకులు సందనవేన రాజేందర్, మారం తిరుపతియాదవ్, రాజయ్యయాదవ్, తమ్మడబోయిన ఓదెలు, కుమార్ యాదవ్, నాగారపు సత్యనారాయణ, చిలారపు పర్వతాలు, మేకల రాజేందర్, అట్ల సాగర్, రాజం మహంత కృష్ణ, పోసాని శ్రీనివాస్ యాదవ్, ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, బత్తిని లక్ష్మణ్, రాజ్‌కుమార్ ఉన్నారు.

క్లుప్తంగా

జీపీ ట్రాక్టర్ అదుపుతప్పి కార్మికుడు మృతి



భూమయ్య (ఫైల్)

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గ్రామ పంచాయతీ ట్రాక్టర్ అదుపు తప్పి కరెంట్ స్తంభానికి ఢీకొని జీపీ కార్మికుడు మృతిచెందిన ఘటన తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామంలో జరిగింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బస్వాపూర్‌లో శనివారం రాత్రి జీపీ ట్రాక్టర్ అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనగా, ట్రాక్టర్‌పైన ఉన్న మల్టీపర్పస్ వర్కర్ దాచారం భూమయ్య (55), గొడిసెల అనితకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పంచాయతీ కార్యదర్శి వేణు సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం భూమయ్యను కరీంనగర్ తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. అనితకు సిరిసిల్లలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. కాగా మృతుడు భూమయ్యకు ఇద్దరు భార్యలు, కూతురు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో గ్రామస్తులు చందాలు పోగుచేసి ఆదివారం అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఖిలా చూసేందుకు వచ్చి.. ప్రమాదం బారిన పడి

- మొలంగూర్ ఖిలాపై విరిగిన పర్యాటకురాలి కాలు

శంకరపట్నం: శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిలా సందర్శనకు వచ్చిన మధ్యప్రదేశ్‌కు చెందిన పర్యాటకురాలు అదుపుతప్పి పడిపోవడంతో కాలు విరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన దంపతులు ఆరుమాసాలుగా వివిధ పర్యాటన ప్రదేశాలు సందర్శిస్తున్నారు. ఆదివారం మొలంగూర్ ఖిలాకు వచ్చారు. ఖిలా కింద దూద్ బావిని పరిశీలించారు. ఖిలా పైకి వెళ్లి అందాలు వీక్షిస్తున్న క్రమంలో అదుపుతప్పి పడిపోయింది. కాలు విరగడంతో గ్రామానికి చెందిన 10మంది యువకులు పైకి వెళ్లి సుమారు మూడు గంటల పాటు కష్టపడి మహిళను కిందకు మోసుకొచ్చారు. 108లో హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.



ప్రమాదంలో గాయపడిన పర్యాటకురాలు

అప్పు కింద రెండెకరాలు సేల్‌డీడ్

- మాజీ ఉప సర్పంచ్ భర్త ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

ఇబ్రహీంపట్నం: అవసరం కోసం అప్పు తీసుకున్నందుకు ఉన్న భూమిని సేల్‌డీడ్ చేసుకున్నాడో వడ్డీ వ్యాపారి. సదరు వ్యాపారి బాధలు భరించలేక బాధితుడు నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్‌లో చోటుచేసుకుంది.

బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ ఎలేటి సుజాత భర్త జనార్దన్ నాలుగేళ్ల క్రితం మెట్‌పల్లికి చెందిన ఓ వడ్డీ వ్యాపారి వద్ద రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఏడాది తర్వాత వడ్డీకి వడ్డీ కలిపి మొత్తం చెల్లించాలని వ్యాపారి డిమాండ్ చేశాడు. లేకుంటే భూమి రిజిస్ట్రేషన్ చేయాలని బెదిరించాడు. దీంతో గ్రామశివారులో తనకున్న రూ.60లక్షల విలువైన 82 గుంటల భూమిని సేల్‌డీడ్ చేసి ఇచ్చారు. ఆ సమయంలో రూ.11 లక్షల అప్పు ఇచ్చినట్లు లెక్క చెప్పగా.. జనార్దన్ మాత్రం నెలనెలా వడ్డీ ఇచ్చినట్లు చెబుతున్నాడు. తన భూమి తనకు రిజిస్ట్రేషన్ చేస్తే డబ్బులు చెల్లిస్తానని జనార్దన్ చెప్పగా.. సదరు వ్యాపారి రూ.10 వడ్డీ చొప్పున లెక్క చేసి రూ.25 లక్షలు కట్టాలని డిమాండ్ చేశాడు. దీంతో జనార్దన్ శనివారం రాత్రి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన భార్య, కుటుంబసభ్యులు వెంటనే మెట్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై ఎస్సై అనిల్‌ను వివరణ కోరగా.. ఇప్పటివరకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.



చికిత్స పొందుతున్న జనార్దన్

చికిత్స పొందుతూ రైతు మృతి

గోదావరిఖని(రామగుండం): స్థానిక గంగానగర్‌కు చెందిన రైతు మేకల సతీశ్(40) చికిత్స పొందుతూ మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్సై భూమేశ్ తెలిపిన వివరాలు.. ఎల్కపల్లి గ్రామంలో వ్యవసాయం చేస్తూ గంగానగర్‌లో ఉంటున్న సతీశ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల 18న క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వైద్యం కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వెలుగుల దీప్తి.. ఆలోచనల స్ఫూర్తి

- చిమ్మచీకట్లను పారదోలే పండుగ
- నేడు దీపావళి



విద్యానగర్(కరీంనగర్): కోటి వెలుగుల కాంతి.. కొత్త ఆలోచనలకు స్ఫూర్తి దీపావళి. నిశీధి నిశ్శబ్దాన్ని బాణసంచాతో బెదరగొట్టి చిమ్మ చీకట్లను చెల్లాచెదురు చేసే ఆ సంబరం దీపావళికే సొంతం.

వెలుగుల పండుగ

'తమసోమా జ్యోతిర్గమయా' అనే ఉపనిషత్ వ్యాక్యానికి ఆచరణరూపం దీపావళి. దీపావళి పర్వదినానికి యుగాల చరిత్ర ఉంది. ఇల్లంతటినీ దీపాలతో అలంకరించేది ఈ పండుగ రోజు మాత్రమే. ఆధునికత ఎంతో పెరిగినా దీపావళి రోజు ప్రమిదలో వత్తి వేసి నూనె పోసి ఆ దీపాల్నే వెలిగిస్తాం.

ఇతర దేశాల్లో దీపావళి

జపాన్‌లో కోరా నాగోషి పేరుతో దీపాల పండుగను పితృదేవతల సంస్మరణార్థం జరుపుతారు. చైనాలో హయివో హోవా పండుగలో పెద్ద ఎత్తున బాణసంచా పేలుస్తారు. నేపాల్‌లో ఆహారం ఐదురోజుల పండుగ. మొదటిరోజు కాకుల పండుగ, రెండో రోజు కోతుల పండుగ, మూడోరోజు ఆవుల పండుగ, నాల్గోరోజు దీపాలు వెలిగించి బాణసంచా పేలుస్తారు. చివరిరోజు ఆడపడుచుల పండుగ. ఇజ్రాయిల్ వారి స్వాతంత్ర్య వీరుడు మెకాబ్బిన్ స్మృత్యర్థం హనుకా అనే దీపోత్సవం జరుపుతారు. ఈజిప్టులో ఓ సిరీస్ మరణానికి చిహ్నంగా ఇంటింటా దీపాలు వేలాడగడతారు. అమెరికాలో నవంబరు 1న హాల్‌వీన్ అనే పేర దీపావళి వంటి పండుగ జరుగుతోంది. క్రైస్తవులు జరుపుకునే క్యాండిల్ ఫెస్టివల్ దీపావళి లాంటిదే. ముస్లిం దేశాల్లోనూ దీపావళి పండుగ ఉన్నది. మహ్మద్ పైగంబరు నూతన సంప్రదాయాన్ని స్థాపించి మక్కాకు తిరిగి వెళ్లిన రాత్రికది సూచిక. దీనిని షబ్ ఎ బారత్ అంటారు. ఆ రోజు బాణసంచా పేల్చారట.

వివిధ రాష్ట్రాల్లో..

రాష్ట్రాల వారీగా దీపావళి గురించి చెప్పుకుంటే గుజరాత్‌లో లక్ష్మీపూజ, గణపతిపూజ, కర్నాటకలో బలిపాఢ్య పండుగ, బెంగాల్, ఒడిశాలో కాళీపూజ, శక్తిపూజ, ఇతర రాష్ట్రాల్లో గోవర్ధనపూజ, యమ ద్వితీయ, భయ్యదూజ్ పండుగలు దీపావళితోనే ముడిపడి ఉన్నాయి. దీపావళి ముందు రోజును నరక చతుర్దశిగా దీన్ని పిలుస్తున్నారు.

టపాసులతో భద్రం

విద్యానగర్(కరీంనగర్): దీపావళి అంటేనే భిన్నమైన పండుగ. వయోభేదం లేకుండా ప్రతి ఒక్కరూ బాణాసంచా కాల్చడానికి ఉత్సాహం చూపుతారు. కాగా అతి ఉత్సాహంలో టపాసులు కాల్చేటప్పుడు అజాగ్రత్తతో ప్రమాదాలను కోరి తెచ్చుకుంటూ ఆస్పత్రుల పాలవుతుంటారు. ముఖ్యంగా పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు జాగ్రత్తలు పాటించాలి.

భారీ శబ్దాల బాంబులు

ప్రస్తుతం దీపావళి అంటే బాంబులు, టపాసుల పేలుళ్లతో వీధులన్నీ దద్దరిల్లిపోతున్నాయి. హైడ్రోజన్, సుత్తిలీ, లక్ష్మి, శివాజీ, డబుల్ సౌండ్స్, త్రిబుల్ సౌండ్స్ వంటి పేర్లతో భారీ శబ్దాలు పుట్టించే బాంబులు తయారవుతున్నాయి. ఢాం.. ఢాం అంటూ పేలే బాంబుల మోతలతో చెవులు దిమ్మెక్కెతున్నాయి. పరిమితికి మించిన శబ్దాలను విని, కాలిన గాయాలకు చికిత్స కోసం ఆస్పత్రుల చుట్టూ తిరిగినా జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేక జీవితాంతం బాధపడుతూనే ఉంటారు. ఈ పరిస్థితులు రాకుండా తగిన జాగ్రత్తలతో పండుగను జరుపుకోవడం ఉత్తమం.

అత్యవసర ఫోన్ నంబర్లు	
ఫైర్ స్టేషన్	101
అంబులెన్స్	108
పోలీస్ కంట్రోల్ రూం	100

టపాసులు కాల్చడంలో జాగ్రత్తలు

- నాణ్యమైన బ్రాండ్లకు చెందిన బాణాసంచా కొనుగోలు చేయాలి. రాకెట్లు, ఆకాశంలోకి దూసుకెళ్లే టపాసులను గుడిసెలు, గడ్డివాములు లేని ప్రదేశాల్లో కాల్చాలి.



- కాకరకొవ్వొత్తులు, విష్ణు చక్రాలు, భూచక్రాల వంటివి శరీరానికి దూరంగా ఉంచి కాల్చడం మంచిది. రాకెట్లు కాల్చేటప్పుడు వాటిని సీసాలో పెట్టి నిటూరుగా ఉండేలా సరి చూసుకోవాలి. కాటన్ దుస్తులు ధరించాలి. చిన్నారులు కాల్చేటప్పుడు పెద్దలు పక్కనే ఉండాలి.

గుండెజబ్బులవారు జాగ్రత్తగా ఉండాలి



దీపావళి పండుగలో ఎంత సరదా ఉందో ప్రమాదం కూడా అంతే ఉంది. గుండె జబ్బులున్న వారు భారీ శబ్దాలకు దూరంగా ఉండాలి. హార్ట్ అటాక్ వచ్చి కోలుకున్నవారు, పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ శబ్దాల వల్ల గుండె ఎక్కువగా కొట్టుకోవడం, బీపీ పెరగడం వంటివి ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ జి.వెంకట్‌రెడ్డి, జనరల్ మెడిసిన్, కరీంనగర్

గాయాలపై నీరు పోయాలి



టపాసులు కాల్చే సమయంలో గాయమైతే వెంటనే కాలిన గాయాలపై నీరు పోయాలి. ఎందుకంటే టపాసుల్లో ఉండే రసాయనాలు రక్తంలో కలిసి మరింత ప్రమాదానికి దోహదం చేస్తాయి. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. బర్నాల్, సిల్వర్ సల్ఫాడైటిన్, పౌండేర్, అయోడిన్ లాంటి క్రీమ్‌లను దగ్గర ఉంచుకోవడం మంచిది.

– డాక్టర్ వి.సుమన్‌చందర్‌రావు, చర్మవ్యాధుల నిపుణుడు, కరీంనగర్

ప్రాథమిక చికిత్స చేయొద్దు



మనిషి వినికిడి శక్తి 20 నుంచి 60 డెసిబుల్స్ మాత్రమే. ప్రస్తుతం లభిస్తున్న బాంబులు 100 నుంచి 180 డెసిబుల్స్ శబ్దం చేసేవి. ఒక వేళ చెవి నొప్పి వచ్చినా, చెవి నుంచి రక్తం వచ్చినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. చెవిలో నీళ్లు, నూనె, ఇతర చెట్ల ఆకుల రసం పోయడం వంటివి చేయకూడదు.

– డాక్టర్ సీహెచ్.రమణాచారి, ఈఎన్‌టీ నిపుణుడు, కరీంనగర్

ఉద్యోగుల వివరాల నమోదులో బిజీ

- ఆన్‌లైన్‌లో అన్ని వివరాలు నమోదు
- అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమాచారం కూడా
- కాంట్రాక్ట్, రెగ్యులర్ ఉద్యోగుల సమాచారం సేకరణ

పెద్దపల్లి: జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో గల రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమాచారం సేకరణలో యంత్రాంగం నిమగ్నమైంది. గౌరవ వేతనం, డెయిలీవేజ్, పార్ట్ టైమ్, ఫుల్‌టైమ్ తదితర విభాగాల వారీగా ఉద్యోగుల వివరాలు సేకరిస్తున్నారు. వారివివరాలను జూనియర్ అసిస్టెంట్, లేదా సీనియర్ అసిస్టెంట్‌కు అందజేయాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆధార్, పాన్‌కార్డు అందజేయాలి

ఉద్యోగుల ఆధార్, పాన్‌కార్డు, సెల్‌ఫోన్ నంబర్లు, ఉద్యోగుల చేరిన తేదీ తదితర వివరాలన్నీ సీనియర్ లేదా, జూనియర్ అసిస్టెంట్లకు ఇవ్వాలని, ఇవ్వని వారికి ఈనెల జీతం రాదని ఆర్థికశాఖ హెచ్చరించింది. వివరాలన్నీ ప్రతీనెల 10వ తేదీ వరకు ఆర్థికశాఖ నిర్వహణ పోర్టల్(ఐఎఫ్‌ఎంఐఎస్)లో నమోదు చేయాలని ఉత్తర్వులు జారీచేసింది. అయితే, జిల్లాలోని అధికార యంత్రాంగం ఈనెల 18వ తేదీ వరకు ఉద్యోగుల్లో సగం మంది వివరాలు కూడా నమోదు చేయలేదని తెలిసింది.



ఆన్‌లైన్ వివరాలు నమోదు చేస్తున్న ఉద్యోగులు

బోగస్ ఉద్యోగులను వేరువేసేందుకేనా?

ప్రభుత్వం వద్ద ఉద్యోగుల సమగ్ర సమాచారం లేదని, కొన్నిచోట్ల అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో అందరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. కొన్నిచోట్ల ఉద్యోగం మానేసి తాత్కాలిక ఉద్యోగులు, అనధికారికంగా దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లినవారి పేరిట కొందరు వేతనాలు డ్రా చేస్తున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. ఈనేపథ్యంలోనే పేరు, ఆధార్, సెల్ నంబర్లు తీసుకుని ఆన్‌లైన్‌లో సమాచారం నమోదు చేస్తే ఉద్యోగుల వివరాలన్నీ ప్రభుత్వం వద్ద ఉంటాయని, అక్రమాలకు తావు ఉండదని భావిస్తున్నారు. దీనిపై ఓ ఉన్నతాధికారిని సంప్రదించగా.. ఉద్యోగుల వివరాలను ప్రభుత్వం అడిగిన మాట వాస్తవమేనన్నారు. అన్ని వివరాలతో కూడిన నివేదికను శాఖల వారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని ఆయన వివరించారు.

స్వగ్రామానికి మృతదేహాలు



ప్రకాశ్(ఫైల్)

రామడుగు/మేడిపల్లి: ఉపాధి కోసం ఒకరు.. ఉన్నత చదువుల కోసం మరొకరు విదేశాలకు వెళ్లి.. ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా, వారి మృతదేహాలను ఆదివారం స్వగ్రామాలకు తీసుకొచ్చారు. వివరాలు.. కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఎలగుందుల ప్రకాశ్ (35) కొద్దిరోజులుగా దుబాయ్‌లో కంపెనీలో కాకుండా కలివెల్లిగా జీవనం సాగించాడు. ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. అతడి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడం కష్టంగా మారింది. దీంతో కుటుంబ సభ్యులతోపాటు, బీఆర్ఎస్ నాయకులు పూడురి మల్లేశం, దుబాయి ఎల్లాల శ్రీనన్న సేవా సమితి సభ్యులు చిలుముల రమేశ్‌కు తెలిపారు. ఈక్రమంలో రమేశ్ సేవా సమితి అధ్యక్షుడు రవిదేవిడ్‌కు తెలియజేయడంతో దుబాయ్‌లోని ఇండియన్ అసోసియేషన్ వారితో మాట్లాడారు. దీంతో ప్రకాశ్ మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకురాగా, పలువురు శ్రద్ధాంజలి ఘటించారు.

ఉన్నత చదువుల కోసం వెళ్లి..



మహేందర్‌రెడ్డి (ఫైల్)

లండన్‌లో ఈనెల 3న గుండెపోటుతో చనిపోయిన జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన ఏనుగు మహేందర్‌రెడ్డి (26) మృతదేహాన్ని ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన మహేందర్‌రెడ్డి విగతజీవిగా మారడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అతడి తండ్రి రమేశ్‌రెడ్డి కాంగ్రెస్ మేడిపల్లి మండల అధ్యక్షుడు కావడంతో పెద్దసంఖ్యలో ప్రజలు, ప్రముఖులు మహేందర్‌రెడ్డి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

సాయుధ రైతాంగ పోరాట వీరుడు లచ్చన్న

- అంతిమయాత్రలో ఎర్రజెండాలతో నినాదాలు



లచ్చన్న (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల రైతాంగ సాయుధ పోరాటంలో కామ్రేడ్ లచ్చన్న చురుకైన పాత్ర పోషించారని సీపీఐ రాష్ట్ర నాయకుడు గుంటి వేణు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లో శనివారం అనారోగ్యంతో మృతిచెందిన తాళ్లపల్లి లచ్చన్న(75) అంత్యక్రియలు ఆదివారం నిర్వహించారు. అంతిమయాత్రలో దారిపొడవునా కామ్రేడ్ లచ్చన్న అమరహే అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ, బాల్యంలోనే లచ్చన్న ముంబాయ్ వెళ్లి విప్లవ కార్మికవర్గ నాయకుడిగా ఎంతోమందిని ఉద్యమం వైపు నడిపించారన్నారు. తాను పని చేస్తున్న కంపెనీలో యూనియన్ ఏర్పాటు చేసి తొలుత ఐఎఫ్‌టీయూ, ఏఐఎఫ్‌టీయూ నాయకుడిగా ఎదిగారన్నారు. ప్రజా సంఘాల నాయకులు లచ్చన్న మృతదేహంపై ఎర్రజెండా కప్పి విప్లవ జోహార్లు తెలిపారు. 'తరమెల్లి పోతుంది.. త్యాగాల స్వారాగం.. ఆగిపోతుంది.. ఓ వీరులారా.. ఓ సూరులారా.. వందనాలు.. ఎర్ర వందనాలు'.. అంటూ విప్లవ గీతాలు ఆలపించి లచ్చన్నకు చివరి వీడ్కోలు పలికారు. అరుణోదయ కళాకారిణి విమలక్క సెల్ ఫోన్ ద్వారా విప్లవ సందేశాన్ని అక్కడికి వచ్చిన వారందరికీ వినిపించారు. ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



లచ్చన్న మృతదేహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

అదృశ్యమైన యువకుడి మృతదేహం



చందుర్తి(వేములవాడ): బతుకమ్మ ఆట చూసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన యువకుడు 20 రోజులకు పాడుబడిన వ్యవసాయ బావిలో కుళ్లిన స్థితిలో కనిపించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన మట్టేల తిరుపతి (30) గత నెల 29న సద్దుల బతుకమ్మ ఆట చూసి వస్తానని తల్లి భాగ్యవ్వకు చెప్పి వెళ్లాడు. 24 గంటలు గడిచినా కుమారుడు తిరిగి ఇంటికి రాకపోవడంతో అదే నెల 30న భాగ్యవ్వ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అదృశ్యం కేసు నమోదు చేశారు. కాగా జోగాపూర్ పక్క గ్రామం కిష్టంపేటకు చెందిన పూదూరి బాపురావు వ్యవసాయ బావిలో కుళ్లిన స్థితిలో తిరుపతి మృతదేహం లభ్యమైంది. బాపురావు చిన్న కుమారుడు మహేశ్ బావికి సమీపంలో గేదెను కట్టేసేందుక వెళ్లగా కుళ్లిన మృతదేహంపై షర్టు కనిపించడంతో పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా తిరుపతి కొద్దిరోజులుగా మతి స్థిమితం సరిగా లేక బావిలో పడి మృతిచెంది ఉంటాడని పోలీసులు, గ్రామస్తులు భావిస్తున్నారు.

సారెలు పోయి.. మిషన్లు వచ్చినయ్





మంథనిరూరల్: ఒకప్పుడు కుమ్మరిశాలనీకి వెళ్తే సారెల చప్పుడు వినబడేది.. కుమ్మరి సారెను తప్పుతూ ఉంటే ఆ చక్రాన్ని ఎంతో ఆసక్తిగా చూస్తూ ఉండేవాళ్లం. ఇప్పుడు కాలం మారింది. ఇందుకు అనుగుణంగా కుమ్మరి ఇళ్లలోకి యంత్రాలు వచ్చిచేరాయి. సారెలు గుడిసెల్లో మూలన పడగా యంత్రాలు రయ్‌రయ్ మంటూ తిరుగుతున్నాయి. వాటిపై మట్టిపాత్రలు, కుండలు తయారు చేస్తున్నారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం అక్కెపల్లి గ్రామంలో ఓ కొట్టంలో కుమ్మరి సారె ఇలా మూలన పడేసి ఉండగా 'సాక్షి' కెమెరా కంటపడింది.

కుప్పలు.. తెప్పలు



రైస్‌మిల్లులో గన్నీ సంచుల కుప్ప

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ధన్యం పోసే గన్నీసంచులు రైస్‌మిల్లర్లలో కుప్పలు తెప్పలుగా పడిఉన్నాయి. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం గన్నీ సంచుల్లో నింపి రైస్‌మిల్లులకు తరలించాల్సి ఉంటుంది. అక్కడ వడ్లను మర పట్టించి బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సంచులను ప్రభుత్వమే తక్కువ ధరకు కొనుగోలు చేసి ధాన్యం సేకరణ కేంద్రాలకు పంపించేది. ప్రస్తుతం కొత్తగన్నీ సంచుల కోసం టెండర్లు పిలిచిన ప్రభుత్వం.. పాతవాటిని మళ్లీ వినియోగించేందుకు వీలులేకుండా పోయింది. దీంతో ప్రభుత్వంతోపాటు రైస్‌మిల్లర్లపై ఆర్థిభారం పడుతుందని భావిస్తున్నారు.